
క్లుప్తంగా

28న ఆర్టీసీ స్థలాల లీజుపై సమావేశం

రాయచోటి అర్బన్ : ఆర్టీసీ స్థలాలు లీజుకు యిచ్చే అంశంపై ఈనెల 28న లక్కిరెడ్డిపల్లె ఆర్టీసీ బస్టాండులో సమావేశం జరుగుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ ధనుంజయ తెలిపారు. సమావేశానికి జిల్లా ప్రజారవాణా అధికారి జగదీష్ హాజరవుతారన్నారు. ఆసక్తిగల పారిశ్రామిక వేత్తలు, రవాణా రంగంలో అనుభవం కలిగిన వ్యాపారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జనం


చిట్వేలిలో అమ్మవారి గ్రామోత్సవ దృశ్యం

చిట్వేలి : చిట్వేలి బ్రాహ్మణ వీధిలో వెలసివున్న మారెమ్మ తల్లి నిమజ్జనోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నూతన ఆలయాన్ని నిర్మించి గత బుధవారం నుంచి శుక్రవారం వరకు పూజలు, అభిషేకాలు, హోమాలు, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో అమ్మవారి పాత విగ్రహాన్ని, పోతులరాజు విగ్రహాన్ని మెయిన్ రోడ్డు, బ్రాహ్మణ వీధి మీదుగా శనివారం గ్రామోత్సవం నిర్వహిస్తూ భక్తి శ్రద్ధలతో యల్లమరాజు చెరువులో నిమజ్జనం చేశారు.

జగన్ ప్రభుత్వంలోనే సొంతింటి కల సాకారం


గృహప్రవేశంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి

గాలివీడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే సొంతింటి కల సాకారం అవుతోందని వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక గుర్రాలమిట్ట వద్ద జగనన్న కాలనీలో నిర్మించిన అంజలి కుమార్ దంపతుల గృహ ప్రవేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కలిప్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, బండి పరశురాం, లక్ష్మయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు


వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న అటవీ అధికారులు

చిట్వేలి : అడవులు, వన్యప్రాణులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక అటవీశాఖ అధికారులు, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, బీట్ ఆఫీసర్ చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అటవీశాఖ ఆధ్వర్యంలో అడవి, వన్యప్రాణులు, మానవులపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ప్రతి పాఠశాల నుంచి ఐదుమంది వ్యాసరచన, ఐదు మంది చిత్రలేఖనం పోటీలలో ప్రతిభచాటారు. వీరి పేర్లను జిల్లా అధికారులకు పంపనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూ విక్రయానికి విశేష స్పందన

ఒంటిమిట్ట : శ్రీ కోదండ రామాలయంలో నాలుగవ శనివారం శ్రీవారి లడ్డూ విక్రయాలకు విశేష స్పందన లభించింది. ఆలయ టీటీడీ అధికారుల సమక్షంలో ఉదయం 7 గంటల నుంచి తాత్కాలిక లడ్డూ కౌంటర్ వద్ద లడ్డూలను విక్రయించారు. మొత్తం 1000 లడ్డూలు మధ్యాహ్నం 12 గంటలకే కొనుగోలు చేశారు.

ప్రత్యేక అలంకారంలో వేణుగోపాలస్వామి



పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు గ్రామంలో వెలసిన వేణుగోపాలస్వామి మూలవిరాట్‌కు శనివారం ప్రత్యేక అలంకారం చేశారు. గ్రామంలోని భక్తులు వేణుగోపాలస్వామిని తులసిమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పూజారి చంద్రశేఖర్ శర్మ, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యలు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నియోజకవర్గ ప్రజలే నా దేవుళ్లు


సమావేశానికి హాజరైన గృహసారథులు, వలంటీర్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

- ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా
- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : 'నా నియోజకవర్గ ప్రజలే నా దేవుళ్లు.. వారికి ఎప్పుడూ అందుబాటులో ఉండి అండగా ఉంటా.. ప్రజల కష్టాలు తీర్చడమే ప్రధాన లక్ష్యం'.. అని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వలంటీర్లు, గృహసారథుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సంక్షేమం.. అభివృద్ధి కోసమే వైఎస్ జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందుకే ప్రజలను ఓటు అడిగే ధైర్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఈ విమర్శలను ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారన్నారు. పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని అందుకు అనుగుణంగా మేనిఫెస్టో తయారు చేసి ఇప్పటికే 99శాతం హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిది అని కొనియాడారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసేందుకు ధైర్యం లేక పొత్తులు పెట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వలంటీర్లు గృహసారథులు, సైనికుల్లాగా పని చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం మార్కెట్ యార్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్దన్ రెడ్డి, సర్పంచ్ నాగభూరెడ్డి, మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రమణ, అన్నమయ్య జిల్లా ప్రచార కార్యదర్శి జాకీర్ హుసేన్, రాష్ట్ర యువజన విభాగం జనరల్‌సెక్రటరీ వెంకటసుబ్బారెడ్డి, నారాయణ, మురళీధర్‌రెడ్డి, వెంకటరెడ్డి, పెద్దరెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు, గృహసారథులు, వడ్డెర సంఘం నాయకుడు ఆంజనేయులు, దూదేకుల సంఘం నాయకుడు హుసేన్, మాజీ మండలాధ్యక్షుడు నారాయణ, ఆదినారాయణరెడ్డి, ఆదిరెడ్డి, ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో శ్రీకృష్ణుని దేవస్థానం నిర్మాణం

రాజంపేట రూరల్ : మదనగోపాలపురం ప్రజలు రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామికి కోటి రూపాయలతో దేవస్థానం నిర్మించనున్నారు. అందులో భాగంగా శనివారం దేవస్థాన నిర్మాణానికి అంకురార్పణ కార్యక్రమం కొండూరు విశ్వనాథరాజు పర్యవేక్షణలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, సుగుణ దంపతులు పాల్గొని భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలోని పెద్దలు, మహిళలు, గ్రామ ప్రజలు, పూజలు చేశారు. పూజలలో పాల్గొన్న వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శరత్ కుమార్‌రాజు మాట్లాడుతూ గ్రామాలలో ఆధ్యాత్మికత పెంపొందడానికి దేవాలయాల నిర్మాణం దోహదం చేస్తుందని అభిప్రాయ పడ్డారు.


వేణుగోపాలస్వామి దేవస్థాన నిర్మాణానికి పూజలు చేస్తున్న శరత్‌కుమార్‌రాజు, సుగుణ దంపతులు

కోదండ రామయ్యకు స్నపన తిరుమంజనం


ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ మూర్తులు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్నపన తిరుమంజనం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారులు ఆధ్వర్యంలో సుప్రభాత సమయాన శ్రీరామచంద్రమూర్తికి పట్టు వస్త్రాలు, పుష్పాలు, ఫలాలు, అభిషేక సామగ్రి సమర్పించారు. ఆలయ పండితులు వేద పారాయణం, సహస్ర నామార్చన, కుంకుమార్చన, మంగళ హారతులతో విశేష పూజలు నిర్వహించారు.

బెటాలియన్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ

సిద్దవటం : మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంఈఓ శంకరయ్య మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల లోని విద్యార్థుల హాజరు, పలు రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలోని చెత్తా, చెదారాలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి వంద శాతం ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బెటాలియన్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం అమలును పరిశీలిస్తున్న ఎంఈఓ

గాలివీడు మీదుగా బెంగళూరుకు బస్సు సర్వీసు


గాలివీడు-బెంగళూరు బస్సు సర్వీసుకు హారతులు ఇస్తున్న గ్రామస్తులు

గాలివీడు : రాయచోటి నుంచి గాలివీడు మీదుగా బెంగళూరుకు నూతన బస్సు సర్వీసును నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం బస్సు సర్వీసును ప్రారంభించగా, గాలివీడు చేరిన బస్సుకు గ్రామస్తులు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. గ్రామీణ ప్రాంతాల మీదుగా బెంగళూరుకు బస్సు సర్వీసు నడపడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ బస్సు సర్వీసు ప్రతిరోజు ఉదయం 6 గంటలకు రాయచోటిలో ప్రారంభమై గాలివీడు, పెద్దమండ్యం, తంబళ్లపల్లి, మొలకల చెరువు, చింతమణి మీదుగా మధ్యాహ్నం 2 గంటలకు బెంగళూరుకు చేరుతుందన్నారు. తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు బెంగళూరులో బయలుదేరి అదే మార్గంలో రాత్రి 9.45 గంటలకు రాయచోటికి చేరుతుందని తెలిపారు.

గ్రామీణులకు చట్టాలపై అవగాహన అవసరం

జడ్జి సంధ్యారాణి

రాజంపేట : గ్రామీణులకు చట్టాలపై అవగాహన అవసరమని జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. శనివారం పోలి గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేకించి మహిళల సంరక్షణకు ఉన్న చట్టాలను తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఉచితంగా న్యాయ సహాయం అందజేయడానికి సౌకర్యాలను కల్పించామన్నారు. నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖాళీ చెక్కులు, బాండ్లపై సంతకాలు చేయరాదన్నారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సచివాలయ సిబ్బంది, కోర్టు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి

తీగలవంకలో మృతదేహం లభ్యం

రాజంపేట: పెనగలూరు మండలం కంభాలకుంటలో 20 రోజుల కిందట కొన్నిపాటి వెంకటేశ్వర్లు (55) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. అయితే రాజంపేటరేంజ్ పరిధిలోని రోళ్లమడుగులోని తీగలవంకలో అతడి మృతదేహం లభ్యమైంది. రాజంపేట అటవీశాఖ సిబ్బంది, పోలీసులు సమాచారంతో మృతుడిని బంధువులు గుర్తించారు. మృతుడి తనయుడి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ భక్తవత్సలం కేసు నమోదు చేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

పుల్లంపేట : పుల్లంపేట మండలం రెడ్డిపల్లిలోని ఎరువుల దుకాణాల్లో శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ లింగప్ప, వ్యవసాయ అధికారులు తనిఖీ చేశారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఎరువులు అధిక ధరలకు అమ్ముతున్నారని వారి దృష్టికి రావడంతో 120 బస్తాల యూరియాను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణచైతన్య, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీనివాసులు, నాగేశ్వరరావు, యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

రామయ్యకు డబ్బుల లెక్కింపు మిషన్

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి శనివారం అన్నలూరు శ్రీధర్ అనే భక్తుడు డబ్బుల లెక్కింపు మిషన్ వితరణగా ఇచ్చారు. ఈమేరకు ఆయన తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ అధికారులకు అందజేశారు.

భద్రకాళీ సమేతుడికి ఏకాంత సేవ


ఉయ్యాల (శయనోత్సవం) సేవలో భద్రకాళీ సమేతుడు

రాయచోటిటౌన్ : రాయచోటి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శనివారం రాత్రి స్వామివారికి, అమ్మవారికి ఏకాంత సేవ చేశారు. ఈ పూజలలో భాగంగా స్వామివారికి డోలోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రంగు రంగు పూలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. అలాగే ఉత్సవ మూర్తులకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి భద్రకాళీ సమేతంగా శయనోత్సవం (ఉయ్యాల సేవ) నిర్వహించారు.

మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె గ్రామంలో వెలిసిన మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

హరిహరాదుల ఆలయంలో విగ్రహ ప్రతిష్ట

వీరబల్లి : మండల కేంద్రమైన వీరబల్లిలోని శ్రీహరిహరాదుల ఆలయంలో శనివారం సుబ్రమణ్యం స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. యువనాయకుడు మదన్ రెడ్డి అలియాస్ విజయ సాగర్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, మురళీరెడ్డి, మదన్ రెడ్డి దంపతులు, అంజలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ. 70 కోట్లతో రోడ్ల నిర్మాణం

- ఆదర్శ నియోజకవర్గంగా మారుస్తా
- ప్రజా సంక్షేమం.. అభివృద్ధే మా లక్ష్యం
- ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు


గుర్రప్పపాళెం నుంచి వీవీకండ్రిగ వరకు జరుగుతున్న రింగ్‌రోడ్డు పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వవిప్

రైల్వేకోడూరు : నియోజకవర్గానికి మంజూరైన రూ.70 కోట్ల బీటీ, సీసీ రోడ్ల పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపడుతున్నట్లు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. శనివారం నియోజకవర్గంలో పలు మండలాల్లో జరుగుతున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా రైల్వేకోడూరు మండలం రెడ్డివారిపల్లె పంచాయతీలోని గుర్రప్పపాళెం ఎస్టీకాలనీ నుంచి వీవీకండ్రిగ వరకు జరుగుతున్న రింగ్‌రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, బీటీ, సీసీరోడ్ల నిర్మాణం, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ఇలా ప్రతి గ్రామంలో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం.. అభివృద్ధే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. రైల్వేకోడూరును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. గ్రామీణులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఈ పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకుండా ఉండాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. గ్రామాల ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేయాలనే ఉద్దేశంతోనే ఈ రింగ్‌రోడ్లు, బీటీ, సీసీ రోడ్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు.

'చలో విజయవాడ' విజయవంతం చేయండి


పోస్టర్‌లను విడుదల చేస్తున్న సీపీఐ నేతలు

రాయచోటి అర్బన్ : జగనన్న లబ్ధిదారులకు గృహ నిర్మాణం కోసం మంజూరు చేసే మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తూ మార్చి 2న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాయచోటి కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా నేత విశ్వనాథనాయక్‌లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన ఆ పార్టీ నాయకులతో కలిసి పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకుడు వంగిమళ్ల రంగారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు మర్రి సుమిత్ర, అరుణ, సీపీఐ సీనియర్ నేత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మశాన స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవు

ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు

సిద్దవటం : ఎగువపేట ఎస్సీల స్మశాన స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు హెచ్చరించారు. మండల కేంద్రమైన సిద్దవటం ఎగువపేటలో ఎస్సీలకు సంబంధించిన స్మశాన స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్పందనలో ఫిర్యాదు చేసిన వారితో మాట్లాడారు. ఈ విషయంపై తహసీల్దారు శంకర్‌రావుకు సమాచారం ఇచ్చామని, సర్వే చేసి స్మశాన స్థలానికి హద్దులను ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.


సిద్దవటం ఎగువపేట ఎస్సీల స్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు

గ్రామాభివృద్ధికి ఐసీఐసీ ఫౌండేషన్ తోడ్పాటు


గ్రామాభివృద్ధిపై గ్రామస్తులతో మాట్లాడుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సంబేపల్లె : ఐసీఐసీ ఫౌండేషన్ ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులను చేపట్టడం ఎంతో గర్వకారణమని గ్రామ సర్పంచ్ ఉదయకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీలోని గోరావాండ్లపల్లెలో రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీఐసీ ఫౌండేషన్ ద్వారా వర్మీకంపోస్టు, కూరగాయతోటలు తదితర ఆర్థిక స్వావలంబన కలిగించే పథకాలను ప్రజలకు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఆశయాలను సాధించుకోవాలి

రాజంపేట : ప్రతి విద్యార్థికి అనంతమైన శక్తి సామర్థ్యాలు ఉంటాయని, వాటిని క్రమశిక్షణతో వినియోగించుకోవాలని.. ఆశయాలను నిర్దేశించుకొని ఆచరించి సాధించుకోవాలని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ సూచించారు. ఏఐటీఎస్‌లోని అన్నమాచార్య కమ్యూనిటీ రేడియో స్టేషన్ (89.6 ఫ్రీక్వెన్సీ)ను శనివారం పట్టణానికి చెందిన విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కమ్యూనిటీ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవడానికి రేడియో ఉపకరిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు రేడియో ప్రసారాలపై అవగాహన కల్పించారు. స్టూడియో, యాంటీనా, రికార్డింగ్ రూం, ట్రాన్స్‌మిషన్ సెక్షన్ గురించి అవగాహన కల్పించారు. రేడియో స్టేషన్ మేనేజరు ఈ కార్యక్రమంలో డా.కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన జడ్జి

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ యర్రగుంట్ల సమీపంలోని కస్తూర్బా పాఠశాలను శనివారం జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదల, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాల సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. విద్యార్థినులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి, రికార్డులను పరిశీలించారు.


కూరగాయలను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి

ఇంటర్ ప్రయోగ పరీక్షలకు సర్వం సిద్ధం

నేటి నుంచి తొలి దశ పరీక్షలు ప్రారంభం

రాజంపేట టౌన్ : ఇంటర్మీడియట్ సైన్స్ విద్యార్థులకు ఆదివారం నుంచి ప్రాక్టికల్ (ప్రయోగ) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీంతో సైన్స్ విద్యార్థులకు ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన తొలి అంకం ప్రారంభం అయినట్లే. ప్రాక్టికల్ పరీక్షలకు రాజంపేట పట్టణంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలో ఉర్దూ జూనియర్ కళాశాలతో కలిపి రెండు ప్రభుత్వ, నాలుగు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలతో పాటు గంగిరెడ్డి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులకు రాయచోటి మార్గంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్‌కు సంబంధించి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే కాకతీయ జూనియర్ కళాశాల, నలంద, గీతాంజలి కళాశాలలకు చెందిన విద్యార్థులకు వారి కళాశాలలోనే పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ఆయా కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్ ప్రాక్టికల్ పరీక్షలకు విద్యార్థులకు అవసరమైన పరికరాలన్ని సమకూర్చి సర్వం సిద్ధం చేశారు. ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం జరగనున్నాయి. ఉదయం బ్యాచ్‌కు చెందిన వారికి 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం బ్యాచ్‌కు చెందిన వారికి 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో ఎంపీసీకి సంబంధించి 503 మంది, బైపీసీకి సంబంధించి 180 మంది విద్యార్థులు ప్రయోగ పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్ష సమయంలో విద్యార్థులకు ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే వెంటనే వైద్యం అందించేందుకు ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య సిబ్బందిని నియమిస్తున్నారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందున ప్రతి గది వద్ద నీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో భాగంగా పరీక్షా గదుల్లో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు.


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్‌కు సంబంధించి ఏర్పాట్లు చేసిన దృశ్యం

ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకొస్తే అనుమతించం



ప్రాక్టికల్స్ పరీక్షలకు ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకొస్తే అనుమతివ్వబోము. విద్యార్థులు సెల్‌ఫోన్, క్యాలుకులేటర్,, స్మార్ట్ వాచ్‌లను పెట్టుకొని వస్తే పరీక్షా కేంద్రంలోకి కూడా అనుమతించము. క్యాల్యుకులేషన్‌కు చిన్నలాగర్థం పుస్తకం ఉపయోగించుకోవడానికి మాత్రమే అనుమతిస్తాము. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాము.

– రామిరెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాజంపేట